# ధర్మశాస్త్రము ఇశ్రాయేలు జాతీయ చట్టంగా

ఏలయనగా మనము ఆయనకు మొఱ పెట్టునప్పుడెల్ల మన దేవుడైన యెహోవా మనకు సమీపముగానున్నట్టు మరి ఏ గొప్ప జనమునకు ఏ దేవుడు సమీపముగా నున్నాడు? మరియు నేడు నేను మీకు అప్పగించుచున్న యీ ధర్మశాస్త్రమంతటిలో నున్న కట్టడలును నీతివిధులునుగల గొప్ప జనమేది? (ద్వితీయో. 4:7, 8).

దేవుడు ఇశ్రాయేలుకు తాను దేవుడుగా ఉండునట్లు నిబంధన చేసుకుని వారిని ఇతరులనుండి ప్రత్యేకపరచుకొన్నట్టు తెలుసుకున్నాం. తన ప్రజలుగా వారు ఎలా ఉండాలో ఉపదేశించడానికి గాను, దేవుడు వారికి ధర్మశాస్త్రాన్ని ప్రసాదించాడు. ఆయా షరత్తులుగల ఈ ధర్మశాస్త్రాన్ని దేవుడు ఇశ్రాయేలీయుల జాతీయ చట్టంగా ఉండునట్లు కూడా ఆయన దానిని వారికిచ్చాడు. ఇశ్రాయేలు దైవిక రాజ్యం, అది దేవునిచే పరిపాలింపబడే రాజ్యమై ఉంది. కుటుంబ బాంధవ్యాలు, ఆహార వ్యవహారాలు, దేశీయ పరిస్థితులు, సామాజిక బాధ్యతలు వగైరాలకు సంబంధించిన విధులు కలిగింది ధర్మశాస్త్రం. వ్యక్తిగతమైన, మతపరమైన, నైతిక సంబంధమైన వివరాలను అది యిస్తుంది.

దేవుడు ఇశ్రాయేలీయులకు యిచ్చిన ధర్మశాస్త్రము ఎలాంటి ప్రత్యేకమైన క్రమంలోనూ వ్రాయబడియుండలేదు. ఒకే రకమైన జీవిత విధానాన్ని తెలియజేసే ధార్మిక విధులు మిశ్రితం చేయబడ్డాయి. అయితే కొన్ని ఒక్కొక్క స్థలంలో కూర్చబడ్డాయి. అలాటి కూర్పులు వ్యక్తిగతమైన బాంధవ్యాలను, బాధ్యతలను, పౌర సంబంధమైన సంగతులను, మతపరమైన కార్యకలాపాలను, యింకా యితర విషయాలను సూచిస్తాయి.

•

## ఒక్క జనమునకైన చట్టం

### ప్రత్యేకింపబడిన దేశానికి

సీనాయి పర్వతము వద్ద ఇశ్రాయేలుకు యివ్వబడిన చట్టం అంతకు పూర్వం యివ్వబడలేదు. అబ్రాహాము, ఇస్సాకు, యాకోబులు కనాను దేశంలో నివసించేటప్పుడు, దేశం కొరకైన చట్టం వారికి అవసరంలేకపోయింది. ఐగుప్తుకు వెళ్లిన వారి సంతతికి సహా అది అవసరంలేకపోయింది. వారు ఐగుప్తు చట్టాలకు లోపరచబడిన బానిస జనమైయున్నారు గనుక. వారు ఐగుప్తును వీడి, స్వతంత్ర దేశమయ్యేవరకు, వారికి తమ జాతీయ చట్టం అవసరం లేకుండపోయింది. ధర్మశాస్త్రమిస్తూ దేవుడు ఆ పరిస్థితిని గుర్తు చేశాడు.

"మరియు నేడు నేను మీకు అప్పగించుచున్న యీ ధర్మశాస్త్రమంతటిలోనున్న కట్టడలును నీతి విధులునుగల గొప్ప జనమేది?" అని మోషే ప్రశ్నించినప్పుడు (ద్వితీయో. 4:8), యితర దేశ వాసులకు ధర్మశాస్త్రం యివ్వబడలేదన్న విషయాన్ని మోషే గుప్తం చేశాడు.

దావీదు యిలా వ్రాశాడు:

> ఆయన తన వాక్యము యాకోబునకు తెలియజేసెను
> తన కట్టడలను తన న్యాయవిధులను ఇశ్రాయేలునకు తెలియజేసెను.
> ఏ జనమునకు ఆయన ఈలాగు చేసియుండలేదు
> ఆయన న్యాయవిధులు వారికి తెలియకయే యున్నవి.
> యెహోవాను స్తుతించుడి (కీర్తన. 147:19, 20).

పౌలు కూడా ఈ సత్యాన్ని తెలియజేశాడు: "ధర్మశాస్త్రము లేని అన్యజనులు స్వాభావికముగా ధర్మశాస్త్ర సంబంధమైన క్రియలను చేసినయెడల వారు ధర్మశాస్త్రము లేనివారైనను, తమకు తామే ధర్మశాస్త్రమైనట్టున్నారు" (రోమా 2:14). 1 కొరింథీ. 9:21లో ధర్మశాస్త్రము లేనివారిని గూర్చి పౌలు సూచించాడు. "ధర్మశాస్త్రము కలిగినవారై పాపము చేసిన వారందరు ధర్మశాస్త్రానుసారముగా తీర్పు నొందుదురు" (రోమా 2:12).

ధర్మశాస్త్రము పది ఆజ్ఞలను విప్పి చెప్పునదైయుండి (నిర్గమ. 34:27, 28; 1 రాజులు 8:9, 21), ఇశ్రాయేలీయులకు అప్పగింపబడింది. ఐగుప్తు బానిసత్వంనుండి ఆయన విడిపించిన ఇశ్రాయేలు ప్రజలు, దేవునిచే ఎన్నుకోబడిన ఆ దేశమై ఉన్నారు.

## ప్రత్యేకింపబడిన భూ భాగం

దేవునిచే యివ్వబడిన నిబంధన ఇశ్రాయేలు దేశంలో ఆచరించవలసియుంది. వారి దేశపు హద్దులను దాటి, వారికి యివ్వబడిన కొన్ని విధులకు లోబడడం కష్టతరంగా ఉంటుంది. మోషే యిలా అన్నాడు: "నా దేవుడైన యెహోవా నా కాజ్ఞాపించినట్లు మీరు స్వాధీనపరచు కొనబోవు దేశమున మీరాచరింపవలసిన కట్టడలను విధులను మీకు నేర్పితిని" (ద్వితీయో. 4:5; 6:1, 2ను కూడా చూడు).

## ప్రత్యేకింపబడిన పట్టణం

తాను ఏర్పర్చుకొన్న స్థలంలో తన్ను వెదకవలెనని దేవుడు ఇశ్రాయేలుకు ఆజ్ఞాపించాడు (ద్వితీయో. 12:5-7). ఆ స్థలము యెరూషలేము పట్టణం, తన పేరు పెట్టడానికి ఇశ్రాయేలు గోత్రములన్నిటిలో యెహోవా ఏర్పరచుకొన్న పట్టణమది" (1 రాజులు 14:21బి;1 రాజులు 11:13; 2 రాజులు 21:4, 7లను కూడా చూడు). ఇశ్రాయేలు దేశ పొలిమేరలలో నివసించేవారికి యెరూషలేము వెళ్లడం గొప్ప ప్రయాసగా ఉండేది, అయితే భూ జనులందరు ఆ ఆజ్ఞను గైకొనాలంటే దాదాపు అసాధ్యంగా ఉండేది.

వాగ్దాన భూమిలో ప్రవేశించిన తరువాత ఈ క్రింది విధంగా చేయుడని దేవుడు ఇశ్రాయేలుకు ఆదేశించాడు:

> నేను మీ కాజ్ఞాపించు సమస్తమును, అనగా మీ దహన బలులను మీ బలులను మీ దశమ భాగములను ప్రతిష్ఠితములుగా మీరు చేయు నైవేద్యములను మీరు యెహోవాకు మ్రొక్కుకొను మీ శ్రేష్ఠమైన మ్రొక్కుబళ్ళను మీ దేవుడైన యెహోవా తన నామమునకు నివాస స్థానముగా ఏర్పరచుకొను స్థలము (యెరూషలేము) నకే మీరు తీసికొని రావలెను (ద్వితీయో. 12:11; 26:2ను కూడా చూడు).

వారి ధాన్యములో పదియవ వంతును లేదా వారి మందలలో తొలి చూలులను ఈ స్థలమునందే, అంటే యెరూషలేములోనే తినాలి. దేవుడు కోరుకున్న ఈ పట్టణానికి వాటిని తరలించడం కష్టతరమైనంత దూరంలో వారు నివసిస్తున్నట్టయితే, వారు వాటిని డబ్బు రూపంలోనికి మార్చుకొని, యెరూషలేమునకు వచ్చి వారికి కావలసిన వాటిని యిక్కడ కొనుక్కోవచ్చు (ద్వితీయో. 12:17-22, 26-28; 14:23-26).

దేవుడు ఏర్పర్చుకొన్న పట్టణంలోనే బలులన్నీ అర్పించవలసి ఉంది (ద్వితీయో. 12:13, 14, 26). సంవత్సరానికి మూడు సార్లు జరిగే పండుగలు (పస్కా, వారముల పండుగ, పర్ణశాలల పండుగ; ద్వితీయో. 16:2-15) అక్కడే ఆచరింపబడాలి. ఈ పండుగ సమయాల్లో మగవారందరు అక్కడ హాజరు కావాలి (ద్వితీయో. 16:16).

యాజకులచే కోర్టు కేసులు ఈ పట్టణంలో విచారించబడాలి (ద్వితీయో. 17:8-13). పర్ణశాలల పండుగ సమయంలో ప్రతి ఏడవ సంవత్సరాన ధర్మశాస్త్రం అక్కడ పఠించబడాలి (ద్వితీయో. 31:10, 11).

## దేవుని యొద్దనుండి వచ్చిన చట్టం

తాను ఇశ్రాయేలునకు యిచ్చిన విధులు, కట్టడలు దేవుడు ఆజ్ఞాపించనవేనని మోషే తెలియజేశాడు. అవి దేవుని ఆజ్ఞలే తప్ప, మోషే స్వయంగా రూపించిన చట్టాలు, విధులు కావు. లేవీయకాండంలో ఆజ్ఞలు జారీచేసిన తరువాత, మోషే యిలా అన్నాడు: "ఇవి యెహోవా సీనాయి కొండమీద ఇశ్రాయేలీయుల కొరకు మోషేకు ఇచ్చిన ఆజ్ఞలు" (లేవీయ. 27:34).

ధర్మశాస్త్ర సంబంధమైన ఆజ్ఞలు, విధులు, కట్టడలు యిచ్చినప్పుడు, అవి దేవునినుండి వచ్చినవని మోషే మాటిమాటికి ఇశ్రాయేలుకు జ్ఞాపకం చేశాడు. అంటే, అవి మోషేనుండి కలిగినవి కావని అర్థం. దీనికి సంబంధించిన ఒక ఉదాహరణ చూడు: "యెహోవా మోషేతో చెప్పిన యీ ఆజ్ఞలన్నిటిలో … పొరబాటున దేనినైనను మీరు చేయకపోయి నప్పుడు …" (సంఖ్యా. 15:22-24); "నేడు మీరు మీ దేవుడైన యెహోవాకు స్వజనమైతిరి గనుక మీ దేవుడైన యెహోవా మాట విని, నేడు నేను నీకు ఆజ్ఞాపించు ఆయన కట్టడలను ఆయన ఆజ్ఞలను గైకొనవలెను" (ద్వితీయో. 27:10).[1] "మరియు యెహోవా మోషేకు ఈలాగు సెలవిచ్చెను …" అనేలాటి ప్రతిపాదనలు (లేవీయ. 18:1; 19:1; 20:1; సంఖ్యా. 8:23; 15:1) – ఇశ్రాయేలుకు యివ్వబడింది దేవుని ధర్మశాస్త్రమేగాని, అది మోషేనుండి కలిగింది కాదని సూచిస్తున్నాయి.

మోషే ఆజ్ఞాపించింది దేవునివలన కలిగిందనేది వాస్తవంగా కన్పించినా, రుజువును

బలీయంగా చూపవలసిన అవసరం ఉంది. “దేవుని ధర్మశాస్త్రము” “మోషే ధర్మశాస్త్రమనే” వ్యత్యాసాన్ని కొందరు చేయబూనుకున్నారు. అలాటి వ్యత్యాసానికి పాత నిబంధనలో గాని క్రొత్త నిబంధనలో గాని ఏ ఆధారమూ లేదు. మోషే ద్వారా దేవుడనుగ్రహించినది యావత్తు ధర్మశాస్త్రం – ఆజ్ఞలు, విధులు, కట్టడలు – దేవుని న్యాయ విధులైయున్నాయి. కొన్ని సార్లు అది “మోషే ధర్మశాస్త్రమనబడినా” (యెహోషువ 8:31; 1 రాజులు 2:3), అది అతని ధర్మశాస్త్రం కాదు. అలాగే, “నా సువార్త” అని పౌలు అంటాడు (రోమా 2:16; 16:25), “అపొస్తలుల బోధ” అనే ప్రయోగాన్ని మనం ఉపయోగిస్తాం (అపొ. 2:42). సువార్త గాని, బోధ అంతగాని, క్రీస్తునకే చెందినదైనా పై ప్రయోగాలను సమస్య లేకుండ అంగీకరిస్తాం.

## దండనతో కూడిన చట్టం

ఈ చట్టాలను అతిక్రమిస్తే దండన ఫలితంగా ఉంటుంది. వీటిలో అనేక అతిక్రమాలకు మరణ దండన విధింపబడుతుంది. కొన్ని సార్లు బాధింపబడినవానికి నష్టపరిహారం చెల్లించడంగాని, బాధింపబడిన వ్యక్తికి జరిగినట్టే బాధించిన వ్యక్తికి చేయడంగాని శిక్షగా విధింపబడుతుంది. బాధింపబడిన వానితో విషయాలు చక్కపరచబడడంతోపాటు, తగిన బలిని సమర్పించడం ద్వారా బుద్ధిపూర్వకంగా చేయని పాపాల విషయంలో దేవునితో సమాధానపరచుకోవాలి (లేవీయ. 4:27–35). నేటి చట్ట విధానాలలో జుల్మానా విధింపబడుతున్న దానికంటే, దేవుడు దిద్దుబాటును మరియు/లేక బలిని కోరుతున్నాడు.

## ముగింపు

మోషే ద్వారా దేవుడు ఇశ్రాయేలుకు అనుగ్రహించిన ధర్మశాస్త్రం, ఒక దేశంగా ఆయనకు విధేయులుగా ఉండడానికి ఉద్దేశింపబడింది; మరి ఏ ఇతరులకు కాదు. వ్యక్తుల యొక్క సాంఘీక, మత పరమైన జీవితాలను ఏలడానికి గాను ధర్మశాస్త్రం వివరాలతో కూడి ఉంది. ఆ విధులకు ఇశ్రాయేలు లోబడితే, ఏర్పరచబడిన దేవుని ప్రజగాను, ప్రత్యేకింపబడిన వారుగాను వారు ఉంటారు.

---

సూచనలు

[1]ఈలాటి ప్రతిపాదనలు ద్వితీయో. 4:40; 8:11; 10:13; 11:27, 28; 13:18; 28:1, 13, 15; 30:8ల్లో ఉపయోగించబడ్డాయి.